"శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీమన్నారాయణుండు సృష్టించిన సృష్టిలో, అత్యద్భుతమైనదీ, నవరసభరితమైనదీ, కూడముచ్చటైనదీ, జనులకు ఐహిక, ఆముష్మిక విద్యలలోగల రహస్యములనెల్ల తెల్పునదీ యగు పుస్తకమేదో చెప్పుము అల్లుడా, నీ ప్రజ్ఞ చూద్దాం" అన్నాడు కైలాసరావు, ముందు సీలింగు ఫాన్‌కేసీ, తరువాత అల్లుడైన శ్యామలరావువైపూ చూసి.

శ్యామలరావు మొహం సీరియస్‌గాపెట్టి ఆలోచించాడు. సృష్టిలో అత్యద్భుతమైనదంటే, సర్వీస్ కమిషన్ పరీక్షలకై బట్టీపెట్టిన జనరల్ నాలెడ్జి నుపయోగించి, జూపిటర్ విగ్రహమో, బాబిలోన్‌లోని వ్రేలాడే తోటలో, ఈజిప్టులోని పిరమిడ్లో సమాధానంగా చెప్పేద్దామనుకున్నాడు గాని, అవేవి తక్కిన విశేషణాలకు సరిపడవని ఊరుకున్నాడు.

మామయ్య అన్నమాటల్ని ఒక్కొక్కదాన్నే మననం చేసుకోసాగాడు; 'నవరసభరితమైనదీ, జనులకు ఐహిక......ఆముష్మిక......వగైరా తెల్పునదీ.......అని అటువంటి దేదైనా వుందా? అని ఆలోచించాడు శ్యామలరావు. బుర్ర బద్దలుకొట్టుకున్నా తట్టట్టులేదు. తను ప్రేమించిన కమల పేరు చెప్పేద్దామనుకున్నాడుగానీ, ప్రస్తుతం కమలపేరెత్తితే తనకు మాట దక్కేటట్టులేదు. కారణ మేమిటంటే, అతికష్టంమీద కైలాసరావు తన తెలివితేటలన్నీ ఉపయోగించి మేనల్లుడు శ్యామలరావుకోసం జి. టి. సి. కంపెనీలో ఒక ఉద్యోగం సంపాదించి మూడునెలలైనా కాకుండా, ఆ ఉద్యోగం పోగొట్టుకునే పరిస్థితులు ఏర్పడగా శ్యామలరావు, మామయ్యని సలహా అడగాలని పరిగెత్తుకొచ్చాడు. కనీసం సంవత్సరమైనా ఆ ఉద్యోగం నిలకడగా



చేస్తేనేగాని, కమలను తనకిచ్చి పెళ్ళిచెయ్యనని కాబోయే మామగారు చెప్పారు. అట్టి సందర్భములో తను కంపెనీ మేనేజరు చండశాసనుడవటం వల్ల, అతనికీ, తనకీ మాటవరసైంపు రావటంవల్లా ఉద్యోగం మానేస్తున్నానంటే, కమలా, కమల తండ్రీకూడా తన చేతకానితనానికి నవ్వుతారు. ఏలాగైనా ఉద్యోగం నిలబెట్టుకోవాలి......ఎలా?" "లావొక్కింతయులేదు, ధైర్యము విలోలంబయ్యె"... అన్న పద్యం చదువుకుంటూ, మామయ్యవద్దకు వచ్చాడు శ్యామలరావు. ఆ పద్యం నోంతో ఆవమని "కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి......' పద్యంలో కృష్ణుడిలా—కైలాసరావు తనో అడ్డు చక్రంవేసే విధానం చెప్తానని, తదనుగుణంగా నడచుకోమనీ అల్లుడికి బోధపరిచాడు. ఆ 'గీతోపదేశం'లాంటి జీవిత రహస్యోపదేశానికి నాంది ప్రస్తావనగా పై ప్రశ్న ఆరంభించాడు ఏభై అయిదేళ్ళ లాయరు కైలాసరావు.

శ్యామలరావుదృష్టి సీలింగ్‌ఫాన్‌మీద కేంద్రీకరింపబడడంచూసి, అప్పుడే రెండు ప్లేట్లలో టిఫిన్‌తో ప్రవేశించిన ఉషాసుందరీదేవి, "ఏమిటోయ్! అల్లుడా! ఆలోచన కట్టిపెట్టి ఫలహారం చెయ్యి. పాపం ఉద్యోగంచేస్తూ సహంమతి పోగొట్టుకుంటే మామయ్యగారి మాటలతో ఆ వున్నది కూడా పోగలదు' అంది నవ్వుతూ.

"అత్తయ్యా!' 'సేవ్ అవర్ సోల్స్'! వెంటనే నువ్వు హెల్పు చెయ్యకపోతే, ఈ మిస్టరీ విప్పడం నాతరం కాదు. ఇదే ప్రశ్న ఈ ఏడాది ఐ. ఏ. యస్. లో అడిగితే, నూటికి నూరుమందీ ఫేలవడం ఖాయం. నువ్వు కాస్త 'హింటు' ఇయ్యాలి" అన్నాడు శ్యామలరావు, కైలాసరావు అడిగిన ప్రశ్నను ఆవిడకు చెప్తూ. ఆమె భర్తవైపు చూసింది. ఆయన సీరియస్‌గా మొహంపెట్టి, గట్టిగా సిగరెట్టుదమ్ము లాగి పొగ ఊదాడు. ఆమె చిరునవ్వు నవ్వింది.

"అదిగోనోయ్, ఆ వస్తువు నీకళ్ళ కెదురుగా టిఫిన్‌ప్లేటులో వుంది. అదే!" అంది సుందరీదేవి. అని, "కాఫీ తెస్తానుండు" అని లోపలి కెళ్ళింది. శ్యామలరావు ఆత్రంగా టిఫిన్‌ప్లేటువైపు చూశాడు.

"ఆ! ఏమిటీ! తైరువడా!" అన్నాడు. 'కలయో, వైష్ణవమాయయో........' అన్న పోజులో శ్యామలరావు. ఒకసారి మామయ్యవైపు చూశాడు. కొంటెగా చిరునవ్వు నవ్వుతున్న కైలాసరావునిచూసి, "నిజమేనా మామయ్యా?" అని అడిగాడు.

"నిజమేరా అబ్బీ! మీ అత్తయ్య షెర్లాక్ హొమ్స్ తెగ చదివి, ఈమధ్య 'మిస్టరీ'లన్నీ విడగొట్టేస్తోంది.

"అయితే మామయ్యా, మరి ఎలా? ఎప్పుడు? ఎందుకు? తైరువడ ప్రపంచాద్భుతాలలో ఒకటిగా పరిగణింపబడింది" అన్నాడు, శ్యామలరావు తైరువడను భక్తిభావంతో చూస్తూ.

"చూడూ! తైరువడంటే ఏమిటి? తెలుగులో పెరుగు గారె! అనగా మామూలు గారెను పెరుగులో నానవేయుటద్వారా ఆ గారె ఉబ్బి, మృదువుగా, కోమలంగా, నవనీతంలా మెత్తగా మారి, మనం తినుటకూ సులభంగా జీర్ణించుకొనుటకూ వీలుగా

# తైర్ధ అద్దం తిరిగింది

రంగనాథ్



తయారవుతుంది. అందులోనే ఐహిక, ఆముష్మికరహస్యాలు ఇమిడిఉన్నాయి. ఏ వ్యక్తినైనా మంచిచేసుకోవాలంటే,వాడిని తైరులో నానెయ్యాలి. అంటే వాడిని స్తోత్రపాఠాలతో మంచి చేసుకోవాలి అప్పుడు వాడు తైరువడలా ఉబ్బిపోయి, మనం ఎలా.చెప్తే, అలా వింటాడు.

ఆఖరికి శివుడైనాసరేభక్తిస్తోత్రాలతో లొంగకతప్పదు. అందువలనఈ పరమరహస్యాన్ని మనకితెలియబర్చటం వలననే తైరువడకు అంత ప్రఖ్యాతి లభించింది."

"అబ్బ! ఏమి అయిడియా, నీది మామయ్యా! ఈ తెలుగుదేశంలో ఉండబట్టి నీ గొప్పతనం ప్రపంచానికి తెలియటంలేదుగాని, ఇదే విదేశీయులైతే నిన్నాకాశాని కెత్తేద్దురు."

"అదేరా అబ్బీ—తైరంటే. అంతమాత్రాన నేనుబ్బిపోవడం లేదనుకో, అయినా నువ్వన్నట్టు, మన తెలివితేటలు ఇంకా తెనుగు ప్రజకు తెలియకపోవడం వల్ల, సభా, సన్మానం లేక, ఇలా మూలపడి వున్నామనుకో."

ఇంతలో చక్కగా ముస్తాబై, చేతిలో కాఫీ గ్లాసులతో ప్రవేశించింది సుందరీదేవి, "మామా అల్లుళ్ళిద్దరూ తైరుప్రపంచంలో విహరించి, మామూలు ప్రపంచంలోకి వచ్చేలోపల, నేను మా లేడీస్ క్లబ్బు మీటింగుకు వెళ్ళివస్తాను" అని బయటికి వెళ్ళిపోబోతూంటే, శ్యామలరావు, "అత్తయ్యా తెలుగుదేశంలో షెర్లాక్‌హొమ్సులేని లోటు నీవలన......." అని ఇంకా ఏదో అనబోయాడు. ఆమె, "చాలు! నాయనా! చాలు! ఆ తైరంతా మీ మేనేజరుమీద ఉపయోగించి, ఉద్యోగం నిలబెట్టుకో" అని నవ్వుతూ బయటికి వెళ్ళిపోయింది.

శ్యామలరావు, మామయ్యవైపు చూసి, "అలాగే చెయ్యాలంటావా మామయ్యా?" అని అడిగాడు.

"అంతేరా అబ్బీ. మీ మేనేజరుని తైరులోముంచి, నీ ఇష్టం వచ్చినట్టు ఆడించచ్చు. నువ్వు కాస్త తెలివితేట లుపయోగించావంటే"

—47వ పేజీ చూడండి

శ్యామలరావు, ముందు తల ఊపాడు కాని, అంతలో ఏదో జ్ఞాపకమొచ్చి, "అన్ని రంగాలలోనూ ధైర్యము ఉపయోగిస్తుందని అనుకోను మామయ్యా" అన్నాడు.

"ఒరేయ్! నీ కా సంశయం ఎంతమాత్రం అక్కర్లేదు. ఉద్యోగ విషయంలోకాని, ప్రణయ రంగంలోకాని........"

"ఆ! ప్రణయరంగంలో కూడానా?"

"ఓ! తప్పకుండా! నీకో కథ చెప్పమంటావా?" అని అడిగాడు, కైలాసరావు పాత సిగరెట్టుతో కొత్తది వెలిగిస్తూ.

"చెప్పు మామయ్యా" అన్నాడు శ్యామలరావు.

"నేను కాలేజీలో చదివే రోజుల్లో ఒక సంఘటన జరిగింది. అవి నేను, ఇంటర్ సెకండియర్ చదివే రోజులు. రాజమండ్రీ ఇన్నీస్‌పేటలో ఆర్ట్సు కాలేజీ ఉండేది. ఆరోజుల్లో బహుకొద్దిమంది ఆడపిల్లలు చదువుతూండేవారు. మా క్లాసులో ఉన్న అమ్మాయిలలోకెల్లా, మిస్ మేరీ అనే అమ్మాయి చాలా అందంగా వుండేది. చాలా గర్వంగా కూడా ఉండేది. మంచి తెలివితేటలూ, పెంకితనమూ కూడా వున్నాయి. ఎవడైనా కాలేజీ కుర్రాడు ఏడ్పించాలని చూస్తే, జోడుతో బుద్ధిచెప్పేది. నేను మొదట్లో ఆ అమ్మాయిని గురించి అంతగా పట్టించుకోలేదుగాని, రాను రాను ఆమె అందాన్నిచూసి ఆకర్షింపబడి, మా మిత్రులయెదుట ఆమెను పొగడుతూండేవాణ్ణి. ఒకసారి మా స్నేహితులు నన్ను 'ధైర్యముంటే ఆమెతో మాట్లాడి, స్నేహం చెయ్య'మన్నారు. నేను పౌరుషంకొద్దీ, ఆమె ప్రేమ వెలాగయినా పొందుతానని చెప్పాను. వాళ్ళు, అది అసంభవం అన్నారు. ఆనాటినుంచీ, ఆమె బెంచీ వెనకాల కూచొని, ఆమె అందాన్ని వర్ణిస్తూ, భావ కవిత్వంరాసి, ఆమెకు వినపడేట్టు చదివేవాణ్ణి. దానికామె మండిపడిపోయేది. అవి, అన్యాపదేశంగా ఉండడంవల్ల ఏమీ చెయ్యలేకపోయింది, కాని ఏమాత్రం అవకాశమున్నా లెక్చరరుకు రిపోర్టుచేసి వుండేది. ఇలా వారంరోజులు గడిచాయి. నన్ను చూసినప్పుడల్లా మండిపడిపోయేది. కోపంలో ఆమె ఎంత అందంగావుందో ఒక గేయం రాశాను. అది విని మరీ మండిపడేది."

"ఒకనాడు ఆమె కాలేజీగేటు దాటుతూండగా ఆమె వెనకాలే, నేను నా ఫ్రండ్సుతో వస్తూ, "ఇన్ని గేయాలు రాసినందుకు ఆ అమ్మాయి నీకేం బహుమతిచ్చిందిరా?" అన్న నా ఫ్రెండ్సుకు, "అదేరా, చూడు కొంచెమయినా మర్యాదలేదు. ఇప్పటికి ఒక శతకం పూర్తయిందిగాని, ఒక చిన్న ప్రెజంటు... ఆఖరికి ఒక చిన్న చిరునవ్వు.....లేకపోతే ఒక లవ్‌లెటరు, ఏమీలేదు" అన్నాను. ఆమె సరిగ్గా మా ముందు నడుస్తోంది. నామాటలు విని గబుక్కున వెనక్కి తిరిగి, "ఏయ్ మిస్టర్, నీకు తగిన బహుమతిదిగో!" అని తన కాలిచెప్పు ఒకటి తీసింది" అని ఆగాడు కైలాసరావు.

"జోడుతో కొట్టిందా మామయ్యా?" అవడిగాడు శ్యామలరావు, మామయ్యకు జరిగిన పరాభవానికి చింతిస్తూ.


"కాలిజోడుతో నా దవడమీద కొట్టబోయింది. నేను సరిగా, ఆ జోడు పుచ్చుకొని, 'ఇంత మంచి

# కథ అడ్డం తిరిగింది

17-వ పేజీ తరువాయి

బహుమతి ఇచ్చినందుకు చాలా థాంక్స్' అని, ఆమెను దాటి ముందుకు గబగబా నడవసాగాను. భద్రంగా ఆ జోడును పదిలపరచి. నేను ఒక ఏభై గజాల దూరం వెళ్ళేసరికి ఆమె కోపంతగ్గి, తన స్థితి గ్రహించుకుంది. అవి ఎత్తుమడమల జోళ్ళు. ఆమె ఒక జోడుతో ఉండిపోయింది. రెండవజోడు నేను పట్టుకుపోతున్నాను. చుట్టూవున్నజనం, ముందు నన్ను చూసి హేళన చెయ్యబోయినవాళ్ళల్లా తరువాత ఆమె పరిస్థితిచూసి నవ్వసాగారు. ఆమె ముందు నన్ను, "ఏయ్ మిస్టర్!" అని పిల్చింది. "మిస్టర్!", "మిస్టర్!" అని ఆమె పిలుస్తూంటే నేను నన్ను కాదన్నట్టు ముందుకు పోసాగాను. ఆమె గట్టిగా "కైలాసరావుగారూ!" అని అరిచాక, నేను వెనక్కి వచ్చి, "నన్నేనా మీరు పిల్చారు?" అని అడిగాను. చుట్టూ చేరిన విద్యార్థులంతా ఘొల్లుమని నవ్వారు. ఆమె, "దయచేసి నా చెప్పు ఇవ్వండి" అని అడిగింది. నేను, అప్పటికే సగం ఏడుపుమొహంపెట్టిన ఆమెనింకా ఏడ్పించడం ఇష్టంలేక, ఆ చెప్పు ఇస్తూ, "ఇకనుంచి దీనిని జాగ్రత్తగా ఉంచుకుంటారనుకుంటాను" అన్నాను. ఆమె మారు మాట్లాడకుండా, చుట్టూవున్న జనం నవ్వుతూంటే, తలవంచుకొని, జోడు తొడిగేసుకుని వెళ్ళిపోయింది" అని కైలాసరావు కొత్త సిగరెట్టు వెలిగిస్తూంటే, శ్యామలరావు, "పాదరక్షప్రయోగాధ్యాయం బాగా రక్తిగట్టింది మామయ్యా" అన్నాడు.

"అప్పటినుంచీ ఆమె జోడు తియ్యడం మానేసింది. నన్నుచూసి మండిపడడం కూడా మానేసింది. ఆ తరువాత ఒకటి రెండుసార్లు నోట్సు అడిగి పుచ్చుకున్నాను. ఒకసారి రోడ్డుమీద నోట్సు అడిగాను. 'చూడండి. మీ రిలా రోడ్డుమీద అడిగితే చూసినవాళ్ళేమనుకుంటారు?" అని అడిగింది. "మనిద్దరం స్నేహితుల మనుకొంటారు" అని నేను సమాధానమిచ్చేసరికి, మరేమీ మాట్లాడలేక నోట్సు ఇచ్చేసి వెళ్ళిపోయింది. ఆరోజునుంచీ, వీలైనంతవరకూ నన్ను తప్పించుకొని తిరగడం ప్రారంభించింది. ఆమెతో ఎలాగైనా స్నేహంచెయ్యాలని నాకు పట్టుదల ఎక్కువైంది. నేను కన్పించగానే, నాకు తనతో మాట్లాడే అవకాశం కలగకుండా తప్పించుకొనేది. అలా ఒక నెలరోజులు ఆమె నాతో మాట్లాడలేదు. మా స్నేహితులు, నాకు మాట నిలబెట్టుకునే



అవకాశం లేదనుకున్నారు. అయినా, నే నధైర్యం చెందలేదు."

"ఒకనాడు సాయంకాలం చీకటిపడ్డాక నేను గోదావరిఒడ్డున మార్కండేశ్వరస్వామి ఆలయం వద్ద నుల్చొని ఆలోచిస్తున్నాను. ఆరోజు ఆరోడ్డు మీద జనం అంతగాలేరు. మిస్ మేరీ, మరొకఅమ్మాయీ రావడం చూసాను. కొద్దిదూరంలో వస్తున్న వాళ్ళు, తొందరగా, బెరుకుగా నడవడం గమనించాను. నావద్దకు రాగానే మేరీ నన్నుచూసి చిరునవ్వు నవ్వింది. నేనూ, వారితో నడవడం ప్రారంభించాను. కొద్ది అడుగులు వేసేసరికి మా వెనకాల ఇద్దరు రౌడీలు రావడం గమనించాను. అప్పు డీ అమ్మాయిలు ఎందుకు భయపడుతున్నారో, నన్ను చూసి ఎందుకు నవ్వారో అర్థమైంది. వారి నా రౌడీలు వెంబడిస్తున్నారు. నన్ను చూసాక మేరీకి ధైర్యం వచ్చింది. మేరీ చాలాదూరం వెళ్ళాలి. ఇన్నీస్‌పేటదాటి, రైల్వే కాలనీకి వెళ్ళాలి. నేను ఆమెను అంతవరకూ అనుసరిద్దామని నిశ్చయించుకున్నాను. ఆ రౌడీలు, నేను ఈ ఆడపిల్లలను అనుసరించడం, పలకరించడం చూసి, లాభంలేదని తప్పుకొన్నారు. ముందు మిస్ మేరీ, ఆమె స్నేహితురాలూ నడుస్తున్నారు. వెనక నేనూ నడుస్తున్నా. వాళ్లిద్దరూ ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. నేను మౌనంగా నడుస్తున్నాను. ఇంతలో ఆ స్నేహితురాలి ఇల్లువచ్చి, ఆమె వెళ్ళిపోయింది. మేరీ ఒంటరిగా నడుస్తోంది. ప్రక్కనే నడుస్తున్న నన్ను చూసి, "మీరు హాస్టలుకు వెడుతున్నారా?" అని అడిగింది. అంతకు ముందు నాకు మాట్లాడడానికైనా అవకాశమివ్వకుండా తప్పించుకొన్నవ్యక్తి, తనకు తానై పలకరిస్తోంది."

"లేదు. రైల్వేకాలనీవరకు వెళ్తున్నాను."

"నేనూ రైల్వే కాలనీకే వెళ్తున్నాను."

"నేను మీతోవస్తే మీకేమైనా అభ్యంతరమా?"

"లేదు." అని చిరునవ్వు నవ్వి, "నామీద మీరు చాలా శ్రద్ధ చూపిస్తున్నారు కారణం తెలుసుకోవచ్చా?" అని అడిగింది.

"అప్పటికి మేము, జనసమూహం తక్కువగా వున్న రోడ్డుమీద నడుస్తున్నాం. అందువల్ల నే నామెతో, ఆమె అందం నన్నాకర్షించిందనీ, ఆమె కళ్ళూ, మొహం చాలా సుందరంగా వుంటాయనీ ఆమెను చూస్తూ, ఏదో అనిర్వచనీయఆనందం అనుభవిస్తాననీ, ఆమె నావైపు చూసినప్పుడల్లా నా హృదయం పరవశమౌతుందనీ, ఆమె కనికరించకపోతే, నా జీవితం దుఃఖమయమౌతుందనీ, ఇంకా ఏవేవో చాలావిషయాలు ఆమెను పొగుడుతూ చెప్పాను. ఆమెకుకూడా నామీద చాలా అభిమానం ఉందనీ, నా మాటలూ, చేష్టలూ, గేయాలూ ఆమెను చాలా ఆకర్షించాయనీ, ఆమె చెప్పింది. ఆ రాత్రి మసకచీకటిలో, నిర్జనప్రదేశాలలో తిరుగుతూ, ఒకరిప్రేమ నొకరికి వెల్లడించుకొన్నాం. ఆరాత్రి ఆమెను ఆమె ఇంటివద్ద దిగబెట్టి, హాస్టలుకి చేరుకునేసరికి, నేను భూమిమీదే వున్నానా? లేక ఆకాశంలో తేలిపోతున్నానా? అని నాకే అనుమానం వేసింది."

"ఆ మర్నాటినుంచీ మా ఇద్దరిమధ్యా ప్రేమలేఖలు జోరుగా నడవనారంభించాయి. రోజూ

# కథ అడ్డం తిరిగింది

విధిగా రైల్వేకాలనీకివెళ్ళి ఆమెను కలిసేవాణ్ణి. నాలుగు నెలలు దాటేసరికి, మేము ఇద్దరం, ఒకరిని వదలి ఒకరం జీవించలేమనుకున్నాం. ఆ విషయం కాగితం మీద చాలాసార్లు రాసుకున్నాం, ప్రేమలేఖల్లో..." అని కైలాసరావు చెబుతూంటే, శ్యామలరావు, "అయితే మామయ్యా, మరి నువ్వు ఆ అమ్మాయిని ఎందుకు పెళ్ళిచేసుకోలేదు?" అని అడిగాడు.

కైలాసరావు గట్టిగా సిగరెట్టుదమ్ములాగి మెల్లిగా పొగ వదులుతూ, "హుఁ! మీ చిన్నతాతయ్య సంగతి నీకు తెలుసుగా. మాకు మా నాన్నగారిదగ్గర కన్నా, బాబాయిదగ్గరే ఎక్కువ భయం. ఆయనకు ఈ సంగతి తెలిసింది. 'ఆ అమ్మాయితో తిరిగావంటే ఒళ్ళు చీరేస్తాను' అని కబురుపెట్టాడు. మన వాళ్లకు చాదస్తం ఎక్కువ. మతాంతరవివాహాలకు ఒప్పుకోరు. అందుకని, మరి బాబాయి నెదిరించి లాభంలేదని, మేరీతో 'మన వివాహం జరగడం దుర్లభం. వేర్వేరు మతాలలో పుట్టటం మనం చేసిన పాపం. అశాశ్వతమైన ఈ తనువులు దూరమైనా, మన మనసులు ఒకటేనని' కన్నీటితో పరిక్షల అనంతరం ఆమెవద్ద సెలవు తీసుకున్నాను" అని కొద్దిసేపు ఆగాడు కైలాసరావు.

శ్యామలరావు, "అయితే నువ్వు గట్టి పట్టుపట్టి, మీ వివాహానికి చిన తాతయ్య ఒప్పుకోడంటావా?" అన్నాడు.

"లాభం లేదురా. ఒకసారి నాకు కోపంవచ్చి, గోదావరిలో దూకుతానని ఉత్తరంరాస్తే, వెంటనే 'ఉట్టి డాబులుకొట్టకుండా, దూకి చూబించమని' జవాబు రాశాడు. అంతపనీ చేద్దామని గోదావరి బ్రిడ్జిదాకా వెళ్లాను. అక్కడనుంచి, ఆ నదివైపు చూసేసరికి భయం వేసింది. అయినా, ఆత్మహత్య మహాపాతకం అన్నారు. పెద్దలని జ్ఞాపకంవచ్చి

---

"క్షమించండి! నేను తొందరగా వెళ్ళిపోవాలి. అరగంట నుంచి టెలిఫోన్ అలా పట్టుకుని కూర్చున్నారుగాని ఒక్క ముక్క అయినా మాట్లాడరు కాదు!"

"ఆపవయ్యా నీగోల! నేను మా ఆవిడతో మాట్లాడుతుంటే."

సి. జ్యోతికుమారి, (వరంగల్లు).

---

తిరిగి పరిగెట్టి వచ్చేశాను" అని ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, తైరుతో ఎలాంటివారైనా వశమవుతారు కాబట్టి మీ మేనేజరుని రోజూ తైరులో ముంచెయ్యి. ఇంటికి పళ్ళూ, గ్రటా పట్టికెళ్తూవుండు. ఆయన తెలివి తేటల్ని తెగ మెచ్చుకో. ఆయన పిల్లల అందాన్ని పొగుడు. అత్యంత వినయ విధేయతల్ని ప్రకటించు. ఆయన కెదురుగా సిగరెట్టు తాగకు" అంటూ కైలాసరావు అనేక నీతుల్ని మేనల్లుడికి బోధించాడు, అతని ఉద్యోగం కాపాడడానికి.

మామయ్య మాటలమీద అతిశ్రద్ధతో, సరిగ్గా ఆయన చెప్పిన మాటల్ని తు. చ. తప్పకుండా పాటించ నిశ్చయించుకొన్నాడు యువకుడైన శ్యామలరావు. ఆనాటిరాత్రే మద్రాసుకు బయల్దేరాడు. మెయిల్లో సెకండుక్లాసు కంపార్టుమెంటులో ప్రయాణం చేస్తున్న పాసింజర్లు, తమ ముందున్న, సన్నగా, ఎర్రగా, పొడుగ్గావుండి, పెద్ద కళ్ళూ, ఉంగరాలజుట్టూ కలిగిన యువకుడు ఏదో ఆలోచిస్తూ, పరధ్యానంగా రాత్రంతా గడిపాడనుకున్నారేకాని, తన మేనేజర్ని తైరులో ముంచడానికి ఒక బ్రహ్మాండమైన ప్లాను గురించి ఆలోచిస్తున్నాడని తెలుసుకోలేకపోయారు. ఎలాగైతేనేం శ్యామలరావు ఆక్షణంనుంచీ, తన మేనేజర్ని ఎలా మంచిచేసుకోవాలా? అని ఆలోచిస్తూనే వున్నాడు. నిజానికి మంచి చేసుకున్నాడు కూడా.

రెండు నెలల తరువాత కైలాసరావుకి అందిన ఉత్తరంలో ఆ విషయం స్పష్టంగాఉంది. ఆ ఉత్తరం సారాంశా లివి:

"మామయ్యా,

నేను వచ్చినదగ్గర్నుంచీ మా మేనేజరుకి విపరీతంగా తైరుకొట్టడం మొదలెట్టాను. రోజూ ఆయన తెలివి తేటల్ని మెచ్చుకోవడమేకాక, ఆయనకు అడ్డమైన చాకిరీ చేస్తున్నాను. వాళ్ళ పిల్లలికి బిస్కట్లూ, పిప్పరమెంట్లూ, వారింటికి కూరగాయలూ, పళ్ళూ ఎన్నో సమర్పించాను. అంతేకాక వాళ్లమ్మాయికి పరిక్ష రోజులని నేను ఆఫీసుకి సెలవుపెట్టి, నెలరోజులు కష్టపడి, ట్యూషన్ చెప్పాను. నా తెలివి తేటలన్నీ ఉపయోగించి, ఆయనను మంచిచేసుకున్నాను. చివరకు నా అంత బుద్ధిమంతుడు లేడనీ, వెంటనే నా ప్రొబేషను పూర్తయ్యేట్టుచేసి, పర్మనెంటు చేస్తాననీ చెప్పారు. అలా నా గురించి రాయదల్చుకున్నారుకూడాను. కానీ, ఇంతలో ఆయన ఉద్యోగానికే ముప్పువొచ్చింది. ఆయన్ని మేనేజరుపదవిలోంచి తీసేసారు. కారణమేమంటే, మినిష్టరు మారిపోవడమే. పాతాయన మునపటి మినిస్టరుగారి బంధువుట. ఆ మినిష్టరుగారు మొన్న ఎలక్షన్లలో ఓడిపోయారు. కొత్త మినిస్టరుగారువచ్చి, తమ బంధువుకు ఉద్యోగం ఇమ్మని అడగగానే, కంపెనీవారు కొత్త మేనేజర్ని వేశారు. పాత మినిష్టర్‌కీ, కొత్త మినిష్టర్‌కి బద్ధవైరం. అందుకని పాతమేనేజరంటే కొత్త మేనేజరుకీ మంట. నాగురించి పాత మేనేజరు బాగా రాశాడట. అందుకని కొత్తాయన నన్ను తీసెయ్యాలని చూస్తున్నాడు....."

అంతవరకు చదివి, కైలాసరావు "డామిట్? కథ అడ్డం తిరిగింది?" అన్నాడు. ★